క్లుప్తంగా

టీడీపీ, వైఎస్సార్‌సీపీ పాలనలో తేడాను గుర్తించండి



వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన అభివృద్ధిని వివరిస్తున్న నాయకులు

హొళగుంద: గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనలో వ్యత్యాసాన్ని గమనించి ప్రజలు ఓటు వేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీరాములు, మండల కన్వీనర్ షఫివుల్లా కోరారు. వారు సోమవారం మార్లమడికి, నాగరకణ్వీ, హొన్నూరు తదితర గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి వైఎస్సార్‌సీపీ పాలనలో జరిగిన మేలును వివరించారు. ప్రతి కుటుంబానికి మంచి చేసిన జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా, కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఆలూరు ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షిని అఖండ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేయగలిగేవి మాత్రమే ప్రజలకు చెప్తాడని, చెబితే చేసి తీరతారని స్పష్టం చేశారు. హామీలిచ్చి మోసగించడం చంద్రబాబు నైజం అని ఆరోపించారు. టీడీపీకి ఓటేస్తే అవ్వతాతలు పింఛన్ల కోసం ఆఫీసుల చుట్టూ తిరగాలని, సంక్షేమ పథకాలన్నీ రద్దవుతాయన్నారు. సంక్షేమం, అభివృద్ధి కొనసాగాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటేసి గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ నాయకులు ఈశా, మోహన్‌రాజు, రమేశ్, చంద్ర, నాగిరెడ్డి, బసవనగౌడ్, మల్లికార్జున, శేషప్ప తదితరులు పాల్గొన్నారు.

పారా మిలటరీ బలగాల కవాతు

చిప్పగిరి: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సోమవారం మండలంలోని నేమకల్లు గ్రామంలో ఎస్‌ఐ మహమ్మద్ రిజ్వాన్ ఆధ్వర్యంలో పారా మిలటరీ బలగాల కవాతు నిర్వహించారు. ప్రధాన వీధులలో కవాతు చేపట్టారు. మండలంలోని సమస్యాత్మక గ్రామాలపై ప్రత్యేక నిఘా ఉంచినట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రతిఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

టీడీపీలో కష్టపడే వారికి గుర్తింపు లేదు

ఆలూరు: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుసినె విరూపాక్షిని భారీ మెజార్టీతో గెలిపించుకునేందుకు కార్యకర్తలు కృషి చేయాలని ఆ పార్టీ నాయకుడు వైకుంఠం మల్లికార్జునచౌదరి పిలుపునిచ్చారు. ఆలూరులోని వైకుంఠం చౌదరి నివాసంలో సోమవారం వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఆయన్ను మర్యాద పూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టీడీపీలో కష్టపడి పనిచేసే వారికి ఎలాంటి గుర్తింపు ఉండదన్నారు. ఈ ఎన్నికల్లో టీడీపీకి డిపాజిట్లు గల్లంతయ్యేలా, వైఎస్సార్‌సీపీకి అఖండ విజయం దక్కేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆలూరు మండల కన్వీనర్ ఈరన్న, వివిధ గ్రామాల నాయకులు ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్‌ల పరిశీలన



ఆలూరులో స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న సీఐ బి.వెంకటేశ్వర్లు

ఆలూరు: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల స్ట్రాంగ్ రూమ్‌లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి ఈవీఎంల భద్రతను సోమవారం ఆలూరు సీఐ బి.వెంకటేశ్వర్లు పరిశీలించారు. ఈవీఎంల భద్రతపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. సీసీ కెమెరాల పని తీరును పరిశీలించారు. స్ట్రాంగ్ రూంల వద్ద సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, రాత్రిబంవళ్లు ప్రత్యేక నిఘా ఉంచాలని ఆలూరు ఎస్‌ఐ ఓబులేసుకు సూచించారు.

అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాల నివారణ

ఆలూరు రూరల్: అప్రమత్తతతోనే అగ్ని ప్రమాదాలు అదుపు చేయవచ్చని ఆలూరు ఫైర్ అధికారి ఖాద్రి అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక బస్టాండ్‌లోని అంబేడ్కర్ సర్కిల్‌లో ప్రమాదాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు ఫైర్ సిబ్బంది మంటలను ఎలా అదుపు చేస్తారో ప్రయోగాత్మకంగా చూపించారు. ఎక్కడైనా ప్రమాదం సంభవిస్తే వెంటనే టోల్ ఫ్రీ నంబర్ 101కు కాల్ చేయాలన్నారు. చిన్న పిల్లలకు అగ్గిపెట్టెలు అందుబాటులో ఉంచరాదని, బీడీ, చుట్ట కాల్చిన వారు పడేసేముందు పూర్తిగా ఆర్పివేయాలని సూచించారు.

దాహార్తి తీర్చండి

తుగ్గలి: మండల కేంద్రంలో నెలకొన్న నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ సోమవారం సీపీఎం మండల కార్యదర్శి శ్రీరాములుతో కలిసి పలువురు గ్రామస్తులు ఎంపీడీఓ విజయలక్ష్మికి వినతి పత్రం అందజేశారు. వేసవి దృష్ట్యా గ్రామంలో తీవ్ర నీటి ఎద్దడి నెలకొందని, మంచి నీటి ట్యాంకర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



ప్రచారంలో భాగంగా 5వ వార్డులో ఇస్త్రీ చేస్తున్న బుట్టా రేణుక



కడివెళ్ల నాయకులకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బుట్టా రేణుక

ఎమ్మిగనూరురూరల్: సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటికీ మేలు చేసిన ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక విన్నవించారు. ఆమె సోమవారం పట్టణంలోని 5వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వార్డు కౌన్సిలర్ అమానుల్లా, వీరశైవ లింగాయతీ కార్పొరేషన్ చైర్మన్ వై.రుద్రగౌడ్, కుర్ని కార్పొరేషన్ చైర్మన్ బుట్టా శారదతో పాటు పార్టీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రచారం చేశారు. వ్యాపారులు, వృద్ధులు, మహిళలను ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వ పథకాలు సక్రమంగా అందుతున్నాయా? అని అడిగి తెలుసుకున్నారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు అందించారని గుర్తుచేశారు. సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్ జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. గత తెలుగుదేశం ప్రభుత్వ పాలనలో సంక్షేమ పథకాలు జన్మభూమి కమిటీలు చెప్పిన వారికే అందేవని, ఇప్పుడు జగనన్న పాలనలో పార్టీలకతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ అందుతున్నాయని తెలిపారు. నాయకులు కిష్టప్పగౌడ్, రియాజ్, బీఎస్.నాగరాజు, అబ్రార్, బుట్టా నీలకంఠ, ఈరన్న, చంద్ర, మల్లికార్జున, సాధిక్, యూసూఫ్, ఇసాక్, రాజారత్నం, సుధాకర్, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఖాళీ అవుతున్న టీడీపీ

5వ వార్డు టీడీపీ నాయకులు ఈడిగ శ్రీరాములగౌడ్‌తో పాటు బుట్టా బాబురావు, నరసింహులు, చిన్నన్న, రంగన్న, నాగరాజు, ఖాజ, పుష్పావతి, లక్ష్మి, నబి, చిన్ననాగరాజు, తిమ్మప్ప, రాజు, ఉదయ్, నరసింహులు, వెంకటేష్, ఈరన్న, చిన్నఖాజ, శ్రీనివాసులు, రామాంజనేయలుతోపాటు మరి కొందరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక, వార్డు కౌన్సిలర్ అమానుల్లా ఆధ్వర్యంలో ఆపార్టీలో చేరారు. వారికి బుట్టా రేణక కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

ఎమ్మిగనూరుటౌన్: స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో కడివెళ్ల గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, గౌడ (ఈడిగ) సంఘ జిల్లా కార్యదర్శి ఉరుకుందుగౌడ్‌తో పాటు సుదర్శన్‌గౌడ్, చిన్నరాముడు గౌడ్, నరసప్ప గౌడ్, బుజ్జిగాడు, వీరేష్, శ్రీనివాసులు, నరసయ్యగౌడ్, పెద్దయ్య గౌడ్‌తో పాటు 300 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు.

- రాయలసీమ కో–ఆర్డినేషన్ కమిటీ (ఆర్‌సీసీ) సభ్యులు రాజ్‌కుమార్‌తోపాటు మహేంద్ర, దస్తగిరి, వీరేష్, ఫరూక్‌బాషా, అర్జున్, గిరి, శాంతరాజు, రామకృష్ణ, ప్రతాప్, నడవలయ్య, నరసింహ, రామాంజి, శ్రీను, బాలరాజుతో పాటు మరో వంద మంది వైఎస్సార్‌సీపీలో చేరగా ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు.
- మున్సిపల్ వైస్ చైర్మన్ నజీర్ అహమ్మద్ ఆధ్వర్యంలో పట్టణానికి చెందిన టీడీపీ మాజీ కౌన్సిలర్ కొయ్య నరసప్పతో పాటు మరికొందరు బుట్టా రేణుక సమక్షంలో వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నారు. పార్టీలో చేరిన వారిలో బత్తిని కుమార్, మోహన్, వెంకటేష్, నాయిని యువరాజ్, సుంకన్న, బసవరాజు, పెద్ది తదితరులు ఉన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌తో మెరుగైన వైద్యం

ఆలూరు రూరల్: ఫ్యామిలీ ఫిజీషియన్ ద్వారా ప్రజలకు మెరుగైన వైద్యం అందుతోందని మొలగవల్లి పీహెచ్‌సీ డాక్టర్ రవి అన్నారు. సోమవారం ఆలూరు–3 సచివాలయం పరిధిలో ఫ్యామిలీ ఫిజీషియన్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. వృద్ధులు, గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు అందించారు. వైద్యారోగ్య సిబ్బంది దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల ఇంటి వద్దకే వెళ్లి పరీక్షలు చేశారు. ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఎప్పటికప్పుడు వారి పరిధిలో ఉన్న ఇళ్లకు వెళ్లి ప్రజల ఆరోగ్య పరిస్థితులను ప్రత్యే క యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమంలో 80 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్ రవి తెలిపారు.

19న బండలాగుడు పోటీలు

చిప్పగిరి: శ్రీరామనవమి సందర్భంగా నేమకల్లు గ్రామంలో ఈ నెల 19న రాష్ట్రస్థాయి వృషభాల రాతి దూలం లాగుడు పోటీలు నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ ప్రేమ్‌కుమార్ సోమవారం తెలిపారు. పోటీల్లో దేశవు ఎద్దులు మాత్రమే పాల్గొనాలన్నారు. విజేతలుగా నిలిచిన వృషభాల యజమానులకు వరుసగా దాతలు బుసినె చంద్రశేఖర్ రూ.30 వేలు, ఎంపీపీ జూటూరు హేమలత రూ.25 వేలు, కుందనగుర్తి దివాకర్ రెడ్డి రూ.22,222 నగదు బహుమతులు అందిస్తారన్నారు. ఆసక్తి కలిగిన రైతులు 18వ తేదీలోపు పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్ర భవిష్యత్తు



వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి

పత్తికొండ రూరల్: ఇంటి ముంగిటకే సంక్షేమాన్ని అందించే ప్రజా ప్రభుత్వాన్ని నిలబెట్టుకుందామని ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం మండల పరిధిలోని పులికొండ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నాయకులు తిప్పయ్య, నరసింహులు ఆధ్వర్యంలో నాయకులు, పార్టీ కార్యకర్తలు ఎమ్మెల్యేకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం సంతాన వరధుడిగా ప్రసిద్ధి చెందిన రంగనాథ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించారు. 'విజయమునీయవయ్యా శ్రీరంగనాథా' అని స్వామివారిని వేడుకున్నారు. అనంతరం గ్రామ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేసి ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయాలని గ్రామస్తులను అభ్యర్థించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. జగనన్న ప్రభుత్వంలో అన్నివర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. రాష్ట్ర భవిష్యత్తు కోసం మరోసారి వైఎస్సార్‌సీపీని గెలిపించాలని కోరారు. కుట్రల కూటమి ఎన్ని మోసపూరిత హామీలిచ్చినా వచ్చేది జగనన్న ప్రభుత్వమే అని ధీమా వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ పాలనలో మేలు జరిగిఉంటే మరోసారి ఓటువేసి ఆశీర్వదించాలని కోరారు. సర్పంచ్ అనసూయమ్మ, ఎంపీపీ నారాయణదాస్, నాయకులు సోమశేఖర్, భాస్కర్ నాయక్, గుజ్జుల ఉరుకుందమ్మ, కేశవరెడ్డి, ఆంజనేయులు, బాబుల్ రెడ్డి, గాంధీరెడ్డి, మల్లికార్జున, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ప్రజా ప్రభుత్వాన్ని మరోసారి గెలిపించండి



కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య

దేవనకొండ: ప్రజల కోసం పాటుపడుతున్న వైఎస్సార్‌సీపీని మరోసారి గెలిపించాలని ఆ పార్టీ కర్నూలు ఎంపీ అభ్యర్థి బీవై రామయ్య, ఆలూరు ఎన్నికల అబ్జర్వర్ తెర్నెకల్ సురేందర్ రెడ్డి విన్నవించారు. ఈ మేరకు సోమవారం దేవనకొండలోని పార్టీ కార్యాలయంలో కొత్తపేటకు చెందిన 10 కుటుంబాలు టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బీవై రామయ్య మాట్లాడుతూ.. టీడీపీ అధినేత చంద్రబాబు సూపర్‌సిక్స్ పథకాల పేరుతో ప్రజలను మోసం చేసేందుకు సిద్ధమయ్యాడన్నారు. 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో రాష్ట్రానికి చేసిందేమి లేదని గుర్తుచేశారు. వ్యవసాయమే దండగా అని వ్యవసాయాన్ని, రైతులను నీరుగార్చాడన్నారు. నేడు కల్లిబొల్లి మాటలు చెబుతూ ప్రజలను మోసం చేయాలని చూస్తున్నారని చెప్పారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థను దేశంలోనే ఆదర్శంగా నిలిపారని, సంక్షేమ పథకాలు ప్రజల ఇళ్ల వద్దకే అందించి ప్రజా మెప్పు పొందాడని వివరించారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. పార్టీలో చేరిన వారిలో మద్దిలేటి, మహేంద్ర, చిన్న వీరన్న, తిక్క వీరన్న, చిన్న మద్దిలేటి తదితరులు ఉన్నారు. పార్టీ మండల కన్వీనర్ తపాల శ్రీనివాసులు, కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు.



గూళ్యం గ్రామ కార్యకర్తలకు పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి బుసినే విరూపాక్షి

వైఎస్సార్‌సీపీలో చేరిక

ఆలూరు రూరల్: సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడే కొద్దీ వైఎస్సార్‌సీపీలోకి చేరికలు జోరుగా సాగుతున్నాయి. ఇతర పార్టీల నుంచి నేతలు, కార్యకర్తలు స్వచ్ఛందంగా ఆ పార్టీలో చేరుతున్నారు. సోమవారం హాలహర్వి మండలం గూళ్యం గ్రామంలోని ఎస్సీ సామాజికవర్గానికి చెందిన గాదిలింగ, బసవరాజు, మల్లిక్, గిరి, రంగయ్య, సోమలింగ, లింగయ్య, భీమ, చంద్ర, ఛత్రయ్యలతో పాటు 60 కుటుంబాలు ఆలూరులోని పార్టీ కార్యాలయంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి ఎమ్మెల్యే అభ్యర్థి విరూపాక్షి కండువాలు కప్పి ఆహ్వానించారు. ప్రతి ఒక్కరూ పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. కార్యకర్తలకు పార్టీ అండదండలు ఎప్పటికీ ఉంటాయని చెప్పారు.

పోలింగ్ రోజు ఇబ్బందులు తలెత్తనీయొద్దు

మద్దికెర: మే నెలలో జరిగే సార్వత్రిక ఎన్నికలలో భాగంగా పోలింగ్ బూత్‌లలో ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని తహసీల్దార్ రజాక్‌వలి అన్నారు. సోమవారం స్థానిక కార్యాలయంలో మండలంలోని బీఎల్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో మొత్తం 34 పోలింగ్ కేంద్రాలలో 29,338 మంది ఓటర్లు తమ ఓటు హక్కు వినియోగించుకోనున్నారని అందుకు తగ్గ ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. సంబంధిత అధికారులు బూత్‌లను ముందుగా పరిశీలించి నీరు, వెలుతురు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీఆర్వోలు, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

చిప్పగిరి: మండలంలోని నేమకల్లు, తిమ్మాపురం క్రాస్ రోడ్డు వద్ద సోమవారం గ్రామ పంచాయతీ కార్యదర్శి బాలన్న చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆ ప్రాంతంలో చలివేంద్రం ఏర్పాటు చేయడం వల్ల రెండు గ్రామాల ప్రజలకే గాక ఆలూరు – గుంతకల్లు ప్రధాన రహదారి కావడంతో వాహనదారులకు, ప్రయాణికులకు ఉపయోగపడుతుందన్నారు. సర్పంచ్ ప్రేమ్‌కుమార్, సత్తి రెడ్డి, ఎంపీటీసీలు సుంకన్న, బీమలింగ తదితరులు పాల్గొన్నారు.

అభ్యర్థుల ఖర్చు లెక్క చెప్పాల్సిందే



మాట్లాడుతున్న ఆలూరు అసెంబ్లీ ఎన్నికల అధికారి రామునాయక్

ఆలూరు రూరల్: ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు తమ ప్రచార ఖర్చును తప్పనిసరిగా ప్రతిరోజూ నియోజకవర్గ ఎన్నికల వ్యయ అధికారికి తెలియజేయాలని ఆలూరు ఆర్‌ఓ రామునాయక్ సూచించారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్ ఆఫీసర్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రచారంలో ఉపయోగించే వాహనాలు, పార్టీ జెండాలు, బ్యానర్లు, కరపత్రాలు, పత్రికలు, టీవీ చానళ్లలో ప్రచురితం, ప్రసారమయ్యే పెయిడ్ ఆర్టికల్స్‌పై ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం అభ్యర్థి ప్రత్యేక ఖాతా నుంచి నగదు డ్రా చేసి ఖర్చు చూపాల్సి ఉంటుందన్నారు. నామినేషన్ దాఖలు చేసిన నాటి నుంచి అభ్యర్థుల ఖాతా నుంచే నగదు ఖర్చు చేయాలన్నారు. ప్రచార సమయంలో అభ్యర్థి దగ్గర రూ.10 వేలకు మించి ఉండరాదని, పార్టీ తాత్కాలిక కార్యాలయాల అద్దె, టిఫిన్లు, భోజనాలు, తాగునీటి బాటిళ్ల ఖరీదు ఈసీ నిర్ధారించిన రేటుతో లెక్క కడతామని చెప్పారు. బహిరంగ సభల ఏర్పాటు ఖర్చును 24 గంటల ముందే తెలియజేయాలన్నారు. నామినేషన్ దాఖలైన నాటి నుంచి అభ్యర్థి ప్రచారంపై వీడియో చిత్రీకరణ ఉంటుందని, అభ్యర్థి మొత్తం ఖర్చు రూ.40 లక్షలకు మించరాదని సూచించారు. ఏఆర్వో చంద్రశేఖర్, టీడీలు రజనీకాంత్ రెడ్డి, గుండాల్ నాయక్, హాలహర్వి తహసీల్దార్ బ్యూలా, సీనియర్ అసిస్టెంట్ బసన్న గౌడ్, అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులు ఉన్నారు.

జగనన్నను మళ్లీ గెలిపించుకుందాం



పూలచింతలో ప్రచారం చేస్తున్న బుట్టా ప్రతుల్

నందవరం: సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ నాయకులు బుట్టా ప్రతుల్ పిలుపునిచ్చారు. ఆయన సోమవారం మండల పరిధిలోని పూలచింత, మాచాపురం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం చేపట్టారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అలాగే ఎమ్మెల్యే అభ్యర్థి బుట్టా రేణుక, ఎంపీ అభ్యర్థి బీవై రామయ్యను గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. సీఎం జగనన్న 58 నెలల్లో ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందించారన్నారు. వైఎస్సార్‌సీపీ పాలనలో పేదల జీవన ప్రమాణాలు మెరుగు పడ్డాయని వివరించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రతిపక్షనేత చంద్రబాబు మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. గత టీడీపీ, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ పాలనకు తేడాను ప్రజలు గమనించి సంక్షేమ పాలనకు పట్టం కట్టాలని కోరారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ శివారెడ్డిగౌడ్, నాయకులు విరుపాక్షిరెడ్డి, పేట శ్రీనివాసరెడ్డి, సురేష్‌గౌడ్, లోడ్డన్న, గోపాల్, బుజ్జి, పెద్దయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల మూకుమ్మడి రాజీనామా



నందవరంలో ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావుకు రాజీనామా పత్రాలు అందజేస్తున్న వలంటీర్లు

- ప్రజాసేవకు దూరం చేయడంపై మనస్తాపం
- ప్రతిపక్షాల తప్పుడు వ్యాఖ్యలపై ఆగ్రహం
- కూటమి కుట్రలకు గుణపాఠం తప్పదని హెచ్చరిక

నందవరం: మండలంలో వివిధ గ్రామాల్లో పని చేస్తున్న 155 మంది వలంటీర్లు స్వచ్ఛందంగా విధులకు రాజీనామా చేశారు. సోమవారం ఎంపీడీఓ కిరణ్‌మోహన్‌రావుకు రాజీనామా పత్రాలను అందజేశారు. అలాగే కనకవీడు గ్రామంలో 20 మంది రాజీనామా పత్రాలను పంచాయతీ కార్యదర్శి రామారావుకు అందించారు. పెద్దకొత్తిలి గ్రామ పంచాయతీ చెందిన వలంటీర్లు 16 మంది పంచాయతీ కార్యదర్శి పెద్దిరెడ్డికి, హాలహర్వి గ్రామానికి చెందిన 13 మంది ఎంపీడీఓకు రాజీనామా పత్రాలను సమర్పించారు. వారు మాట్లాడుతూ.. ప్రజా సేవ కోసం నియమితులైన తమను ప్రస్తుతం కోడ్ పేరుతో విధులకు దూరం చేయడంతో మనస్తాపం చెంది స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నట్లు వెల్లడించారు. వలంటీర్ వ్యవస్థపై నిత్యం విషం కక్కుతూ ఏదోరకంగా కుట్రలకు పాల్పడుతున్న టీడీపీ, జనసేన నాయకులకు తగిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వలంటీర్ల రాజీనామా పత్రాలను ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తానన్నారు.

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని వెంకటాపురం కాలనీతో పాటు పలు వార్డుల్లో పనిచేస్తున్న వలంటీర్లు ఎనిమిది మంది సోమవారం స్వచ్ఛందంగా రాజీనామాలు చేశారు. ఈ మేరకు స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ గంగిరెడ్డికి రాజీనామా పత్రాలను ఇచ్చారు.

గోనెగండ్ల: మండలంలోని గోనెగండ్ల, ఎర్రబాడు, అలువాల, కున్నూరు గ్రామ సచివాలయాల పరిధిలో సేవలందిస్తున్న 40 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. ఎర్రబాడు సచివాలయం పరిధిలో 8 మంది, అలువాలలో 13 మంది, కున్నూరులో 12 మంది, గోనెగండ్ల ఏడుగురు తమ రాజీనామా లేఖలను ఎంపీడీఓ సోనిబాయికు అందించారు.

వెల్దుర్తి(కృష్ణగిరి): వెల్దుర్తి మండలం ఎల్ నగరం సచివాలయ పరిధిలోని ఎల్ నగరం, ఎల్ తండా, దాసరదొడ్డి తండా, ఎల్ కొట్టాల, పిక్కిలివానిపల్లెకు చెందిన 23 మంది, నర్సాపురం సచివాలయ పరిధిలోని సర్పరాజాపురం గ్రామానికి చెందిన ఐదుగురు వలంటీర్లు సోమవారం రాజీనామా చేశారు. రాజీనామా పత్రాలను ఎంపీడీఓ కార్యాలయ ఏఓ బి.లలిత, సెక్రటరీ దేవమ్మకు సమర్పించారు.

25 మంది బైండోవర్

తుగ్గలి: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మండల పరిధిలోని పాత నేరస్తులపై పోలీసులు నిఘా పెట్టారు. సోమవారం తుగ్గలి, జొన్నగిరి పోలీస్ స్టేషన్ల పరిధిలో 25 మందిని తహసీల్దార్ షర్మిల ఎదుట బైండోవర్ చేశారు. అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా పలు గ్రామాల్లోని పాత నేరస్తులు, అక్రమ మద్యం విక్రేతలను బైండోవర్ చేసినట్లు ఎస్‌ఐలు మల్లికార్జున, రామాంజినేయులు తెలిపారు.

ఘనంగా బడేసాహెబ్ స్వామి నెల ఉరుసు

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి గ్రామంలో వెలసిన మహాత్మ గంజిహళ్లి బడేసాహెబ్ స్వామి నెల ఉరుసు మహోత్సవం సోమవారం వైభవంగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారికి ఫాతేహాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా దర్గా కమిటీ సిబ్బంది క్యూలైన్లను ఏర్పాటు చేశారు. గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవడంతో ఇబ్బందులు తప్పాయి. సీఐ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు బుట్టా ప్రతుల్ దర్గాను దర్శించుకొని స్వామి వారికి ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించి పూజలు చేశారు. యూత్ అధ్యక్షుడు బందెనవాజ్, సర్పంచ్ తోలు రాముడు, తదితరులు పాల్గొన్నారు.

నాటుసారా స్వాధీనం

కృష్ణగిరి: మండల పరిధిలోని కంబాలపాడు గ్రామ శివారు పెద్ద వంకలో నాటుసారా తయారీ స్థావరంపై సోమవారం పోలీసులు దాడులు చేశారు. గ్రామానికి చెందిన రామచంద్రుడు వంకలో సారా తయారు చేస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి సిబ్బందితో కలిసి వెళ్లగా నిందితుడు పారిపోయాడు. స్థావరం వద్ద ఉన్న 750 లీటర్ల బెల్లంఊటను ధ్వంసం చేసి 10 లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు.

వైభవంగా వసంతోత్సవం

ఆస్పరి: మండలంలోని కైరుప్పలలో వెలసిన వీరభద్రస్వామి, కాళికాదేవి బ్రహ్మోత్సవాలు సోమవారం వసంతోత్సవంతో ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో స్వామివారికి గంగ, ఆకుపూజ, పంచామృతాభిషేకం, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం వీరభద్రస్వామి గుర్రంపై ఊరేగుతున్నట్లుగా అలంకరణ చేసి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ఉంచి మేళతాళాలతో ఊరేగించారు. భక్తుల నంది కోలు సేవ ఆకట్టుకుంది. ఆనవాయితీగా ఆలయంలో స్వాములకు రంగులు వేసి వసంతోత్సవాన్ని ప్రారంభించారు. చిన్నపెద్ద తేడాలేకుండా ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకున్నారు. యువకులు వీధులలో కేరింతలు కొడుతూ తప్పెట్లు, డప్పులతో ఊరేగారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.